# శిక్ష

చుట్టూ పరికించి చూశాను — బండి లేదు - జీతగాళ్ళు లేరు. "స్టేషన్" ఆవల చెట్లనీడలో సవారిబండి విడిచిన అజ అయిపూలేదు. నన్ను దింపిన రైలు రెండు నిమిషాల్లోనే కూత కూసుకొంటూ జారి పోయింది - జెర్రిపోతులా.

ఆ "స్టేషన్"లో దిగినవాళ్ళు నేను, మరికొందరు పాలమ్ముకొనే వాళ్ళూ - వాళ్ళ కావిళ్ళూ, పాలబిందెలూ...రైల్వేకూలీ నన్ను పరామర్శి స్తున్న చూపులతో సమీపించి టిక్కెట్టు తీసికొని వెళ్ళిపొయ్యాడు.

నాలుగయినా ఎండ చిట—చిట లాడుతోంది.

ప్లాట్ ఫారం బారుకు గానుగచెట్లు - ఆ చివర ఒకటి, ఈ చివర ఒకటి దీపస్థంబాలు - ఎర్రటి అక్షరాలలో ఊరిపేరు మూలగా వ్రాసి ఉంది ఆ దీపాలపై .

ఆ గానుగ చెట్లమధ్య ఒక చెడిపోయిన బోగి - అది స్టేషన్ మాస్టారు కార్యాలయం. స్టేషన్ సరిహద్దులను సూచిస్తూ ఒకవైపు ముళ్ళ తీగె.

జనసంచారం లేని స్టేషన్ - ఉదయం పట్టణంపోయే పెరుగు బండి - సాయంత్రం పట్టణంనుండి వచ్చే తిరుగుబండి - రెండు పాసిం జరు బళ్ళూ రెండు నిమిషాలు మాత్రమే ఆగే కుగ్రామం.

గ్రామానికి స్టేషన్ కు దాదాపు రెండు మైళ్ళ దూరం. నాల్గయిదు గ్రామాలకు, అయిదారు కుగ్రామాలకు మిణుకు మిణుకుమనే చిన్న కోడిగ్రుడ్డుదీపంలా ఉంది ఆ స్టేషన్.

నిర్మానుష్యంగా నిరాడంబరంగా ఉంది.

సంచి, చేత్తో పట్టుకొని గానుగచెట్ల నీడలోకి వెళ్ళి చతికిలబడ్డాను-చెట్టుమొదలు కానుకొని. ట్రాన్సిష్టర్ ఏరియల్ పైకిలాగి "గుర్" - "బర్" మనిపించేసరికి కొండపక్కన డొంకలో మేఘంలా దుమ్ము కనిపించింది. రెండెడ్ల సవారిబండి దూసుకొస్తోంది. గిత్తల గిట్టల రాపిడికి దారంతా ధూళిధూసరితమైపోతోంది.

ట్రాన్సిస్టర్‌కేసి చూసి భుజానికి తగిలించాను. బండిని అల్లంత దూరానే ఆపి జీతగాడు పరుగెత్తుకొంటూ వచ్చాడు - ఎర్రని ఊలు అల్లిన చంద్రకోల భుజాన వేసికొని.

"దణ్ణం దణ్ణం బాబుగోరూ ... ఈ లంకణాల బోటు ఎదవది - ఏరోజు సూసినా పొద్దుగూకినాకే వత్తది. ఈయాల తమ రొత్తన్నారనేమో సరిగ్గా యాలకొచ్చిపోయింది. దీని తస్సదియ్యా నేను-ఇప్పుడేం తొందర్లే అని పాలుమాలా ?..." అంటూ బట్టలసంచి బండిలో పెట్టి నొగలు పట్టుకున్నాడు.

"మరి నీ పెక్కవురా ?" ... వాలుగా ఆనుకొని కూర్చుంటూ అడిగాను.

"వద్దు - వద్దు బాబుగారూ ... ఇవసలే అలరారుతున్న గిత్తలు. ఈ డొంకలో నమ్మటానికీ వీల్లేదు. ఆ పగ్గాలు ఇటు ఇసిరెయ్యండి."

"ఒరేయ్ ... ముందు నాకు మంచినీళ్ళు కావాల్రా."

"ఇక్కడ మంచినీల్లెక్కడివి ? అంతా ఉప్పునీరే. మళ్ళీ మనఊరు పోతేనే ... లేకపోతే ఆ తుమ్మలచెరువుకాడన్నా" అన్నాడు.

మువ్వలు గలగలలాడిస్తూ, కోడెలు ముందుకు కదిలాయి.

మిట్టపల్లాలుగా, గుంటలతో. గుండురాళ్ళతో పాము మెలికల్లా తిరిగిపోతూన్న డొంక. నడుం విరిగిపోసాగింది. ఎంత జాగ్రత్తగా కూర్చున్నా కుదుపులకు వళ్ళు హూనమైపోతోంది. చూస్తూ చూస్తూండగనే తుమ్మల తోపులో ఉన్న నల్లచెరువు కట్ట ఎక్కింది బండి.

చెరువులో నీళ్ళు చూసి నాకు ప్రాణం లేచివచ్చింది. ఆపమని అడిగేలోపునే జీతగాడు నొగలు అదిమిపట్టి ఎడ్లను నిలిపాడు. మోకాళ్ళ లోతువరకు దిగి పది దోసిళ్ళ నీరు పట్టించాను. చన్నీటితో ముఖం మరో సారి అద్దుకొని బండెక్కాను.

బండి ఊళ్ళో ప్రవేశించింది. పల్లెటూరి పిల్లలు నన్ను వింతగా చూస్తూ సినిమాబండివెంట ఎడ్వర్‌టైజ్‌మెంటు కాగితాలకు వెంటబడినట్లు రాసాగారు. అందరి ముఖాల్లోనూ స్వాగతం కనిపించింది. ఆడవాళ్ళు చంటిపిల్లల నెత్తుకొని వీధి వాకిళ్ళకు చేరబడి వింతగా నాకేసి చూడ సాగారు.

బండి దిగి మా ఇంటికిలోనికి ప్రవేశించాను.

"ఏంరా ! చిన్నాడా ? ...రెండు రోజులనాడే వస్తానని ఏంచేస్తు న్నావ్? "నోరారా పిలిచింది మా అమ్మమ్మ.

ఆ పిలుపులో ఉన్న ప్రేమ - మార్దవంకోసం తహతహలాడి రెక్కలు కట్టుకువాలిన నేను ఆ పలుకులతో ఎంతో సంబరపడిపొయ్యాను. నాకు మైనారిటీ చెల్లిపోయిందని భారత ప్రభుత్వం గుర్తించి గౌరవనీయ మైన ఓటు హక్కు కల్గించినప్పటికీ ఆమె నన్ను ఇంకా "చిన్నాడా" - "చిట్టీ" అంటూంటే దువ్వుతున్నకొద్దీ మరింతగా ముడుచుకుపొయ్యే పిల్లికూనలా అయిపొయ్యాను. ఆమె ఎన్నో ప్రశ్నలువేసింది. మా ఇంట్లో వాళ్ళనందరినీ పేరుపేరునా అడిగి వాళ్ళ సుఖసంక్షేమాలు తెలిసి కొని నిశ్చింతగా నిట్టూర్పు విడిచింది.

"అయ్యో - నా మతిమరుపు పాడుగాను ... వేడినీళ్ళు ఆరిపో తాయి...లే...తలంటి పోసుకుందువుగాని...పాడు రైలు - ఆ బొగ్గంతా తలనిండా ఒంటినిండా పడుతుంది ... ఆ గాదె మీద తుండుగుడ్డ ఉంది చూడు. చుట్టుకో" అంటూ ఆమె స్నానానికి ఏర్పాట్లు చెయ్యటానికై లోని కెళ్ళింది, జీతగాడ్ని కేకవేస్తూ.

నన్ను వింతగా అవలోకిస్తున్న ప్రేక్షకలోకం - నన్ను మా ఇంటివద్ద దిగవిడిచి వెళ్తుందనుకున్న ఆ బాలుర పరివారం అలానే మా

పంచలో నిలబడిపోయారు పందిరి గుంజల్లా. మూడు నాల్గు సంవత్సరాల నుండి దాదాపు పది సంవత్సరాల వయస్సులో ఉన్నవాళ్ళు. అందరూ నాకేసి నిర్నిమేష దృక్కులతో చూస్తున్నారు.

కాని ఆ పిల్లవాడు - ఎర్రగా బొద్దుగా ఉన్నాడు - వెన్నముద్దలా మిసిమిసిలాడుతూ. చొక్కా లేదు, భుజాలపై ముడివేసిన బెల్టులకు పట్టు కాని వేలాడుతోంది లాగు.

పోస్టాఫీసు తెరచే ఉంది - గుండీలు రాలిపోయి.

ఇంటి చూరులా కళ్ళ మీదకు వాలిపోయింది పాపటి. నొసటిపై పడుతున్న వెంట్రుకలను పైకి తోసుకొంటూ కుతూహలంగా ట్రాన్సిస్టర్‌ను పరికిస్తున్నాడు. కాంతివంతమైన ఆ కళ్ళలో పరిశీలన, కుతూహలం బుద్ధికుశలత స్పష్టంగా కనుపిస్తున్నాయి.

"నీ పేరేమిట్రా ?..." వాడి దృష్టిని నావైపుకు త్రిప్పుకుంటూ అడిగాను.

సిగ్గు వెల్లువ ముంచెత్తింది వాణ్ని - పెదవులు కుంచించుకొని బుంగమూతి పెట్టాడు - నాకేసి దొంగచూపులు విసరుతూ. కళ్ళు అదోలా తిప్పుకొంటూ మరో పిల్లవాని వెనుక ముఖం చాటుచేసికొన్నాడు.

"బుజ్జిగాడు..." సమాధానమిచ్చాడు ఆ రెండో పిల్లవాడు. ఇద్దరి ముఖాల్లోనూ పోలికలున్నాయి. ఛాయలో మాత్రం తేడా ఉంది.

"మీ తమ్ముడా ?... నే నడిగాను.

'ఔన'న్నట్లు తల ఆడించాడు. వాడి కళ్ళు గర్వంతో మెరిశాయి. నా దృష్టిని ఆకర్షించగలిగిన ముగ్ధమోహనుడు 'బుజ్జి' తన తమ్ముడని పించుకోవటంలో అనిర్వచనీయమైన ఆనందం, గొప్పతనం కళ్ళలో ప్రతిఫలించింది.

"సరే ... నేను స్నానంచేసి వస్తాను. దీన్ని ముట్టుకోకుండా పాటలు వింటూండండీ ..." ట్రాన్సిస్టర్ "ట్యూన్" చేసి వడ్లబస్తాలు మెట్టుపై బెట్టాను.

పిల్లలందరూ కళ్ళు ఇంతింతలు చేసికొని దానిని గుచ్చిగుచ్చి చూడసాగారు - చెవులు దోరగా పెట్టుకొని.

నేను స్నానం ముగించుకొని పంచపాళీలోకి వచ్చాను.

లతామంగేష్కర్ సన్నని రోదన _ విషాదమైన బరువైన సంగీతం - ఆ విషాద సంగీతంతో మేళవించి కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్న "బుజ్జి" - నన్ను చూడటంతోనే దుఃఖం కట్టలుతెంచుకుని ప్రవహించ సాగింది. రెండు ముంజేతులతో కళ్ళు రుద్దుకొంటూ మరింతగా ఏడ్వ సాగాడు.

"ఏమిటి బుజ్జీ ...ఎందుకు ఏడుపు...?"

సమాధానం లేదు. ఒక చేతితో కళ్ళు రుద్దుకొంటూ, రెండవ చేతితో చూపుడు వ్రేలు తన సోదరునికేసి చూపాడు.

"అవునండీ ... ప్రకాష్ 'బుజ్జి'ని కొట్టాడండీ!" ఒక్కుమ్మడిగా అరిచాయి పది - పన్నెండు గొంతులు.

"అంటుకోవద్దని చెబితే ... మరండీ ... మరండీ ... బుజ్జి దీన్ని అంటుకున్నాడండీ ..." ఏరియల్ సున్నితంగా ముట్టుకుంటూ "బుజ్జి"పై నేరారోపణ చేశాడు సంజాయిషీ చెబుతున్న ధోరణిలో ప్రకాష్.

"ఓస్...ఇంతేనా? ... తమ్ముడ్నలా కొట్టవచ్చా ... తప్పు కదూ? దీన్ని అంటుకుంటే నాతో చెప్పాలి ... రా ... బుజ్జీ ... రా" ...దీన్ని నీవు పట్టుకో" అంటూ రెక్కపట్టుకులాగి ట్రాన్సిస్టర్ వాడి చేతుల్లో పెట్టాను.

వాడి కళ్ళు తళతళ మెరిశాయి. ఏడుపు - "స్విచ్" వేస్తే ఆరి పొయ్యే దీపంలో టక్కున మాయమైంది. ఆ విచిత్రమైన పాటలపెట్టెను స్వయంగా చేతులతో పట్టుకునే భాగ్యం లభించినందుకు ఉబ్బితబ్బిబ్బయి పోయి "ఫక్కు"న నవ్వాడు.

మెల్లగా చీకట్లు ముసురుకోసాగాయి.

బజార్లు నిర్మానుష్యంగా తయారు కాసాగాయి. తల్లిదండ్రులు ఎవరి పిల్లలను వాళ్ళు పేరు పేరునా పిలువసాగారు వీధుల్లోనుండి. ట్రాన్సిస్టర్ నిర్విరామంగా సంగీతం వినిపిస్తోంది.

ప్రయాణపు బడలికతో నాకు కనురెప్పలు వాలిపోతున్నాయి.వంట గదిలోనుండి మా అమ్మమ్మ నాకోసం తయారుచేస్తూన్న పిండివంటల ఘుమఘుమలు - వీధుల్లో తల్లిదండ్రుల కేకలు - ప్రేక్షకులు ఒక్కొక్కరే జారుకోసాగారు.

"పోదాం ... రా - రా !" ప్రకాష్ తమ్ముడ్ని రెక్క పట్టుకు లాగసాగాడు.

"ఊహు ... నేను ... రాను ... నువ్వు ... పో..." మరింత కుంచించుకుపోతూ ట్రాన్సిస్టర్‌ని పొట్టకి అదుముకొంటూ బుజ్జి సమాధానమిచ్చాడు.

వాళ్ళ అమ్మకేక మళ్ళీ వినిపించింది.

తమ్ముడిపై వంకతో ప్రకాష్ కూడా కదలడం లేదు. ఆ పసి హృదయాలు ఆ వింత వస్తువును ఎంత బలంగా కోరుకొంటున్నాయో చూసి నాలో నేను నవ్వుకొని ట్రాన్సిస్టర్ 'ఆఫ్' చేశాను.

"టక్కు"ని ఆగిపోయిన దాన్ని విస్మయంగా చూసి "నీవే ఏదో చేశావ్" అన్నట్లు చూపులు నాపై ప్రసరింపజేశాడు బుజ్జి.

"ఇక పాడదు బుజ్జి, దీనికి నిద్రొస్తోంది. ఇక రేపు పాడుతుంది. రేపు పొద్దున్నేరా" అంటూ ఆ వేళకు కార్యక్రమం ముగించాను.

వెనక్కి తిరిగి తిరిగి దానికేసి చూస్తూ మెల్లగా కాళ్ళీడ్చుకొంటూ చీకటిలో మెట్లు దిగాడు బుజ్జి.

* * *

ఆ రెండవరోజు ఉదయానికి నాకు ముక్కులు బిగపట్టివేశాయి.

ఊరి నీళ్ళ ప్రభావమో, చెరువునీళ్ళ మాహాత్మ్యమో. శారీరక అస్వస్థత వలననో కానీ జలుబుచేసింది. ముక్కు చీదుకుంటూ లేచి ప్రక్కపై కూర్చుని తల పైకెత్తి చూశాను.

ఎదురుగా బుజ్జి.

నీటుగా. గోటుగా తయారై చుక్కబొట్టు దిద్దుకొన్న సూరిగాడు, తలకు ఎక్కువగా పట్టించిన కొబ్బరినూనె నొసటిపై జారుతోంది. దేవుని విగ్రహం ఎదుట భక్తిపారవశ్యంతో కూర్చొని. తదేక దృష్టితోచూసే భక్తాగ్రేసరుడులా ఎత్తుగా కిటికిలో ఉన్న ట్రాన్సిస్టర్‌కేసి చూస్తున్నాడు.

ముద్దుగా, బాచిపీటవేసి కూడుచ్చున్నాడు, "రామా ది గుడ్‌బాయ్"లా నేను పడక దిగడంతో వాడ ముఖం విప్పారింది,

"వాట్: బుజ్జీ - ట్రానిస్టర్ పెట్టనా?" అంటూనే దాన్ని అందుకొని "బాండ్" మార్చసాగాను. ఇంతలోనే "బుజ్జి" నా అనుమతి లేకుండా "ఏరియల్" పైకిలాగాడు ఏ సంకోచం లేకుండా. కనుబొమలు పైకెత్తి నిష్ఠురమైన చూపులు ప్రసరింపచేశాను. దానికి సమాధానంగా వాడు కిసుక్కున కొంటెనవ్వు నవ్వాడు. తెల్లని పాలపళ్ళు తళుక్కున మెరిసాయి. కళ్ళలో నిన్న నే నిచ్చిన చనువు ప్రతిఫలింపచేశాడు.

"వెధవా! కమాన్ ... జాగ్రత్తగా పట్టుకో..." వాడి చేతుల్లో పెట్టాను. "సిలోన్"లో ఒకే సినిమాకు సంబంధించిన సంగీతం మొదలైంది. నేను టవలు భుజాన వేసుకొని బావివైపు నడిచాను. స్నానం వలన ముక్కులు మరింతగా బిగుసుకుపొయ్యాయి. ప్రథమ చికిత్సగా మా అమ్మమ్మ వేడిపాలపై ఆవిరిపట్టే కార్యక్రమం ఐదు నిమిషాలు పట్టింది.

ప్రాణం ఉక్కిరిబిక్కిరై పోయి. గమ్మున కళ్ళు మూసికొని మేను వాల్చాను. రేడియో వింటూనే బుజ్జి నన్ను ప్రశ్నలతో వెంటాడుతున్నాడు. అన్నింటికీ ఊఁకొడుతూ, తుమ్ముతూ, చీదుకుంటూ ప్రక్కపై బడి దొర్లసాగాను. అంతలోనే మా అమ్మమ్మ అందుకొంది. "ఒరేయ్ బుజ్జిగా ... నీవు - నీవేమిట్రా? బాబాయ్ అను - నాలుక కోసేస్తా"

అని వాడ్ని గదమాయించింది. ఆమె సలహాను వెంటనే అమలుపరిచాడు. ముద్దుగా నన్ను "బాబాయ్" అని పిలిచి నాకు మరింత చేరువయ్యాడు.

అటపా దడపా వాడి ప్రశ్నలకు సమాధానంచెబుతూ రేడియో వినసాగాను. "ఇంతటితో ఉదయ కార్యక్రమం సమాప్తి -" రేడియో చెప్పింది.

"అయిపోయింది బుజ్జీ! ఏదీ - నా కిచ్చెయ్. మళ్ళీ మధ్యాహ్నం పాడుతుంది. నీవు భోంచేసి తిరిగి రా ... సరేనా!" అంటూ బుజ్జగిస్తున్న ధోరణిలో మెల్లగా వాడి చేతివేళ్ళమధ్య దాన్ని విడిపించాను.

"నేను బువ్వ తినేవచ్చా ..." ఇంటికి వెళ్ళాల్సిన అగత్యం లేదన్నట్లు చూస్తూ పలికాడు.

తల గీరుకొని చెప్పాను. "తింటే మళ్ళీ తినిరా...అయినా ఇది ఇంతలో పాడదు. మళ్ళీ పాడాలంటే పదకొండు కావాలి..."

నా మాటల్లో వాడికి నమ్మకం చిక్కలేదు. గభాలున ముందుకు వంగి "ఏరియల్" లోనికి తోశాడు - ఆదుర్దాగా. ఆ చర్య నాలో కోపం కలిగిస్తుందని గ్రహించి దూరంగా జరిగి పెద్దగా నవ్వసాగాడు. నిర్భయమైన ఆ నవ్వులో తనకు నావద్ద లభించిన స్వేచ్ఛ ఆత్మీయత స్పష్టంగా గోచరించాయి. ఆ చిన్న యంత్రంయొక్క కిటుకు ఆ "ఏరియల్"లోనే ఉన్నదని వాడు గ్రహించినట్లు కళ్ళు గర్వంతో తళుక్కుమన్నాయి.

"ఆరీ వెధవాయి ... దగ్గరకురా చెబుతా " నా కంఠంలో తెచ్చిపెట్టుకున్న కోపం.

"పిల్లలతో ఏం ఆటర్రా...చిన్నాడా...పడుకో...ఒళ్ళు నలిగితేనే ఇలా జలుబులూ జ్వరాలూ...నిద్రపో- అన్నీ పోతాయి. బుజ్జీ! ఇంటికిపో, బాబాయి నిద్రపోతాడు..." మా అమ్మమ్మ లోపలినుండి వస్తూ నాకూ వాడికీ పనులు పురమాయించింది.

ఆమెను చూస్తూనే నవ్వు టక్కున ఆపివేసి భయంభయంగా ఆమె కేసి చూస్తూ నిష్క్రమించాడు బుజ్జి.

"నీవలా పిల్లలను జేరబట్టకురా ... మనం ఇంట్లో లేనప్పుడు ఇక్కడికొచ్చి నానా అగడం చేస్తారు ... మొన్నమట్టుకు మొన్న నేను చేనికిపోయి వచ్చేసరికి వీధి అరుగునిండా మట్టి ఉమ్మెత్తఆకులూ'' అంటూ లెక్చరివ్వటం మొదలుపెట్టింది

"అబ్బ తలనొప్పిగా ఉందమ్మా'' - అన్నాను ఆమె ధోరణి మార్చటానికి ప్రయత్నిస్తూ.

"ఇదేమిట్రా — వచ్చి ఒక్కరోజైనా కాలేదు. తలనొప్పి ఒళ్ళు నొప్పి ... పాడుముండలు - దిష్టిపెట్టి ఉంటారు. దిష్టి తీసేస్తానుండు''- లోనికి వెళ్ళబోయింది.

"వద్దులేమ్మా ... అన్నీ చాదస్తపు పనులు ... '' నిరసన తెలిపాను.

"అయితే ఉండు ... శొంఠిగంధం తీయించి పట్టువేయిస్తా ... చెయ్యిపెట్టి తుడిచినట్టుపోతుంది.''

అమ్మ బాబోయ్.

డేంజర్ - డేంజర్ - పొరపాటున నోరుజారి ఆమెకు అలా చెప్పినందుకు నన్ను నేనే నిందించుకున్నాను: అమె నా ఆరోగ్యాన్ని గూర్చి ఎంత హైరానా పడుతుందో సువిదితం. లోగడ నా చిన్నతనంలో ఆమె వేసిన శొంఠిగంధపు పట్లు - ఆమె బలవంతంగా తాగించిన కషాయాలు అన్నీ కళ్ళముందు పరిభ్రమించాయి. ఆమె అన్నమాట అక్షరాలా చేసి తీరుతుంది. ఆ విపత్తునుండి తప్పించుకోవటం ఎలానా అని క్షణం ఆలోచించి -

"అంతగా లేదులే కొద్దిగా'' అన్నాను.

"అందుకే చెబుతున్నానురా ... పట్టువేయించుకో... మళ్ళీ పెద్దది కాకుండా. నా మాట విను. మా తండ్రివి కదూ ...'' ఆమె ప్రతిమాలి సాగింది.

"వద్దులే ... ఎక్కువయితే అప్పుడు చూసుకోవచ్చు..."

"సరే పోనీ ... పట్టువేయించుకోనకపోతే మానే ... డాక్టరుగారి వద్దకైనా పోయిరా ... తే ... మళ్ళీ ఎండెక్కుతుంది'' అంది.

బోలు ఆశ్చర్యం కలిగింది. ఆ వూరు స్వతంత్ర గ్రామం కూడా కాదు. రైల్వేస్టేషనున్న గ్రామానికది శివారు. అందులో డాక్టర్‌గారు వెలిశారంటే ఉత్తర వియత్నాం నుండి అమెరికా సైన్యాలు ఉపసంహరించుకున్నంత ఆశ్చర్యం కలిగింది. ఏది ఎలా ఉన్నా మా అమ్మమ్మ కొంటిపట్టు బారినుండి తప్పించుకోవాలంటే ప్రస్తుతం ఆ డాక్టరుగారి అన్వేషణలో ఇంటినుండి నిష్క్రమణ ఎంతో అవసరం.

త్వరత్వరగా బట్టలు మార్చుకొని బయటికి అడుగుపెట్టాను.

ఆమె కేకలు వినిపించాయి వెనుకనుండి.

"డాక్టర్‌గారితో సిగ్గుపడకుండా చెప్పు—నేను పేరమ్మగారి మనవణ్ణని. బాగా చూస్తాడు. మొన్ననే ఇరవై మానికలు వడ్లు కొలిపించుకు వెళ్ళాడు—మామూలని...ఆ ... ఇల్లు తెలుసుగా ... ఆ పడమటి వీధి. సందులో ఆ జమ్మిచెట్టుకు పక్కగా మళ్ళితే ... ఆ మూలమీదే ... ఎవర్నడిగినా చెబుతారు."

"సరే సరే" అంటూ లాల్చీ బొత్తాములు సర్దుకొంటూ వీధిలో పడ్డాను.

కాళ్ళు అరిగేలా ఆమె చెప్పిన జమ్మిచెట్టు వీధి, దానికి అనుబంధమైన సందులూ గొందులూ ఒకటికి నాలుగుసార్లు పైకి కిందకూ తిరిగాను. డాక్టర్‌గారి పేరు విద్యార్హతలు సూచించే సైన్‌బోర్డు లేదు. కనీసం ఏ ఇంటిలో నుండైనా కాళ్ళకు చేతులకు కట్లు కట్టుకున్నవాళ్ళు, మందు సీసాలు పట్టుకున్న రోగిష్ఠులు వేంచేస్తున్నారా అంటే అదీ లేదు. ఎవర్నయినా అడుగుదామంటే వీధి వాకిళ్ళన్నీ ఓరగా వేసివున్నాయి.

అటు నడిచాను—ఆ మూలన పడిపోతూన్న పెంకుటింటివైపు. పంచలో నుంచి లయబద్ధంగా పిల్లల గొంతులు వినిపిస్తున్నాయి.

నాలుగు ఒకట్ల నాలుగు—నాలుగు రెళ్ళు ఎనిమిది. ఒక ఫర్లాంగు దూరానికి వినిపించేలా, బాలుర కంఠాలు పద్యం చదివినట్లు రాగయుక్తంగా పలుకుతున్నాయి ఎక్కాన్ని.

దూలాలు విరిగి, పెంకులు రాలిపోయి, గోడలు పగుళ్ళుబారిన, నివాసయోగ్యం కాని ఇల్లు అది—విద్యాలయము. దాని ఉనికిని తెలుపుతూ భావిపౌరులు కంఠాలతో కసరత్తు చేస్తున్నారు — ఉదయాన్నే రేడియోలో వినిపించే వెంకటేశ్వర సుప్రభాతంలా.

మెల్లగా అటు తిరిగాను.

పది సంవత్సరాల వయస్సు పిల్లలు దాదాపు ఇరవైమంది దుమ్ము రేగుతూన్న ఆ ఇంటి పంచపాళీలో నిలబడి ఎక్కాలు బట్టీ వేస్తున్నారు. వారికి ఎదురుగా ఉపాధ్యాయుడు గోడ కానుకొని కూర్చున్నాడు చాపపై. ముందున్న చిన్న బల్లపై రూపాయలు—చిల్లర కార్డులు, కవర్లూ ఇంకా పోస్టాఫీసుకు చెందిన సామాన్య పరికరాలు — ముక్కుపై జారిన సులోచనాల జోడు, మధ్య మధ్యలో అనాలోచితంగా, యాంత్రికంగా బెత్తం తీసికొని బల్లపై కొడుతున్నాడు. ఆ ఇల్లు పాఠశాల అని పిలవటానికి ఏకైక నిదర్శనం ఆయన చేతిలో బెత్త.

నా రాకను ఆయన గమనించలేదు. నన్నుచూసి పిల్లలందరూ ఏదో అనూహ్యమైన సంఘటన జరిగినట్లు వారి నోళ్ళు మూతబడి పోయ్యాయి—కురుస్తూన్న జడివాన ఓ క్షణకాలం ఆగినట్లు విరామం,

ఆయన చేతిలో బెత్తం మళ్ళీ బల్లపై రెండుదెబ్బలు కొట్టింది. మళ్ళీ తారస్థాయికి వెళ్ళాయి కంఠాలు.

"మాష్టారూ?..." మెల్లగా పిలిచాను ఆయన దృష్టిని నావైపుకు తిప్పుకోటానికి ప్రయత్నిస్తూ.

ఆయన అపాటికి నా రాకను గమనించినట్లే తల పైకెత్తకుండగనే 'ఆగ'మన్నట్లు చేతితో సైగచేసి సీరియస్‌గా చిల్లర లెక్కచూసుకో

సాగాడు. వాటిని కుప్పగాపేర్చి మరొకసారి కవర్లూ కార్డులూ లెక్కించాడు.

అంతలోనే ఓ రైతు 'గప్పు' 'గప్పు'మని చుట్ట పొగవదుల్తూ "అయ్యవారూ...అయ్యవారూ...ఒక ఉత్తరం వ్రాయాలి" అంటూ విసురుగ్గా లోనికి వచ్చాడు. ఆ చాప మూలన కూలబడుతూ ఐదుపైసల బిళ్ళ ఆ బల్లపై ఉంచాడు. మాష్టారు ఐదుపైసల బిళ్ళ చిల్లరపై పేర్చి ఒక కార్డుతీసి ఆ రైతు చెప్పినట్లు ఉత్తరం వ్రాయటానికి ప్రారంభించాడు.

నాలుగో ఎక్కం ముగిసింది.

ఐదొకట్ల అయిదు——

ఐదురెళ్ళు పాదీ——

ఇంటిపైన ఉన్న నాలుగు పెంకులూ లేచిపోతున్నాయి. అంతలోనే తగ్గుస్థాయికి వచ్చాయి కంఠాలు. మెల్లగా ఆగిపొయ్యాయి. అయన ఉత్తరం వ్రాయటం ఆపి కోపంగా వాళ్ళవైపు చూపు విసిరాడు.

"వీళ్ళిద్దరూ కొట్టుకొంటున్నారండీ!" ఒక సుబుద్ధి అరిచాడు.

"వెనకున్న సల్లిగాడూ ఇటురండి..."

బెత్తం కోపంతో ఊగసాగింది —— మాష్టారి చేతిలో. జంకుతూ జంకుతూ వాళ్ళ కాళ్ళు ఆయన్ని సమీపించాయి.

"దగ్గరకు రండి. నేను లేచానంటే _ తాట వొలిచేస్తా —— చెయ్యి చాపు——అది——ఇటుతిప్పు..." చట్ట చట్మన బెత్తం వాళ్ళ చేతులను తాకింది. ఎర్రగా కందిపోయిన అరచేతులు ముడుచుకుపొయ్యాయి. ఇద్దరికి వడ్డన పూర్తిచేసిన బెత్తం వెళ్ళిపొమ్మని దారిచూపింది ఆయన కనుబొమలు ఎగరవేస్తూంటే.

మిగతా ఇద్దరూ అందుబాటులోకి వచ్చారు వణికిపోతూ.

"చాపు చెయ్యి" ఆయన కంఠం గద్దించింది.

"మేం అల్లరి చెయ్యలేదండీ. వాళ్ళిద్దరే గిచ్చుతున్నారండీ. మాకేం తెలియదండీ?" అమాయకంగా ముఖాలు పెట్టుకొని, భయం భయంగా, ఒక్కొక్కమాట జారవిడిచారు.

"అలా...వెధవా...నంగనాచిలా ముఖం పెడితే సరా? ... ఇంకా సేపటికైనా నీవు గొడవ చేస్తా...చెయ్యవురా..."

"నిజంగానండీ ... అమ్మ తోడండీ ... మేం అసలు మాట్లాడ లేదండీ..." ఆ చిరుకంఠం ప్రాధేయపడుతోంది.

"అది సరేరా? ... ఇప్పుడు కాదురా ... ఇంకా సేపటికైనా నీవు గొడవ చేస్తావా...చెయ్యవా?...అప్పుడు మళ్ళీ నిన్ను పిలిచి కొట్టటానికి నా కిదే పనుకుంటున్నావా ... నాకు వేరే పనులు లేవా?...పట్టు..." అంటూ నాలుగు అందుకున్నాడు.

ముందు వెళ్ళిపోయిన జట్టుకంటె సగం మోతాదు తగ్గించి వెళ్ళి కూర్చోమని సైగ చేశాడు.

"ఒరే...ఇక కూర్చోండి... ఆ ...ఎక్కాలు అపి చూసి వ్రాత వ్రాయండి..." బిలబిలమంటూ అందరూ కూలబడ్డారు. 'గణితబోధిని' పుస్తకాలు సంచుల్లోకి విసిరివేయబడ్డాయి. వాచక పుస్తకాలు బయటి కొచ్చాయి. చకచకా పలకలన్నీ తుడిచి పారేశారు.

"ఏ పాఠం రాయమంటారూ?..." ప్రియ శిష్యుడొకడు విధేయ తతో అడిగాడు.

"వాలి సుగ్రీవుల కథ — తీసి వ్రాయండి..." మళ్ళీ ఉత్తరం వ్రాయటంలో నిమగ్నుడైపోతూ, తలవంచుకొనే సమాధానమిచ్చాడు. గొలుసుకట్టులో ఉత్తరం నాల్గుముక్కలు గీచాడు. ఆ వ్రాసిన విషయ మేదో మరొక్కసారి ఆ రైతు చెవిని వేశాడు. సంతృప్తిగా ముఖం పెట్టు కొని రైతు నమస్కరించి సెలవు తీసుకొన్నాడు.

మాష్టారి చేతులు వ్రాసీ వ్రాసీ నొప్పులు పుట్టాయి. వేళ్ళు విరుచుకున్నాడు. పెద్దగా ఆవులిస్తూ చిటిక వేసికొంటూ నాకేసి చూపు విసిరాడు కళ్ళద్దాలలోనుండి.

"ఆ...మీ విషయం మరిచేపొయ్యాను...ఏం కావాలి?"

"ఇక్కడ—డాక్టర్‌గారిల్లు ఎక్కడో కనుక్కుందామని వచ్చాను. అంతే..."

ఆయన ముఖంలో కొత్త హుందాతనం ప్రస్ఫుటించింది. బాచీపీట వేసికొన్న అరికాలు రుద్దుకొంటూ, నిటారుగా కూర్చుంటూ గర్వంగా పోజుపెట్టాడు.

ఓ...'పోస్టుమాష్టారు' కమ్ 'టీచర్' — కమ్ 'డాక్టర్' — త్రివిధములైన చర్యలను ఒకేకాలంలో నిర్వహించగలిగిన ప్రజ్ఞాశాలి. విస్ఫారిత నేత్రాలతో ఆయనకేసి ఓ క్షణంకాలం చూసి సంబాళించుకొని,

"మీరేనా...క్షమించాలి ... నాకు బాగా జలుబుచేసింది — తల భారంగా ఉంద"న్నాను. ఆయన విచిత్రంగా నాకేసి చూశాడు. నాలాటి ఆధునాతన నాగరికుడు తనను వైద్యంకోసం ఆశ్రయించటం నమ్మలేనట్లుగా కళ్ళు పెట్టుకొని.—

"తమరు ఎవరబ్బాయి?" అని అడిగాడు.

"నేను పేరమ్మగారి మనమణ్ని ... శెలవలు గడిపి పోదామని వచ్చాను."

దిగ్గున లేచి నిలబడ్డాడు.

"నమస్కారం...నమస్కారం ... చెప్పరేంమరి ... నేను తమరెవరో పొరుగూరి వారనుకొంటున్నాను ... " వినయంగా చేతులు జోడించి ఎనలేని భక్తిశ్రద్ధలు చూపించాడు.

నేను ప్రతినమస్కారం చేశాను.

"రండి...రండీ" అంటూ ఆయన కూర్చున్న చాప మూలకేసి చూపుతూ "ఏదోనండీ ఈ కార్డులూ, కవర్లూ అమ్మినందుకు – టపాలు పంపినందుకు పదిహేను రూపాయలిస్తారు. చన్నీళ్ళకు వేడినీళ్ళు తోడు... ఏదీ మీ చెయ్యి ఇటివ్వండి..." అని ఒక చేత్తో నా మణికట్టు పట్టుకొని మరో చేతితో బెత్తం తీసికొని నాల్గుదెబ్బలు యథాలాపంగా ఆ బల్లపై కొట్టాడు. మౌనవ్రతం పట్టి చూసిన్రాత వ్రాస్తూన్న పిల్లల కళ్ళు మధ్య మధ్య ఆయనకేసి దొంగచూపులు చూస్తున్నాయి.

"ఒరేయ్. నీడ ఎక్కడిదాకా వచ్చిందో చూడు."

ఆయన ఉద్దేశించిన బాలుడు తుపాకి గుండులా బయటికి దూసు కెళ్ళాడు. బయట ఎండ పెళపెళమని కాస్తోంది. ఇంటినీడ ఎండవైపు నేలపై ప్రాకుతోంది. ప్రాకుతున్న నీడకు ముందు నేలపై మూడు గీతలు గీచిఉన్నాయి. ఆ గీతలు ప్రాకుతున్న ఆ నీడ ఆ పాఠశాల వేళానియమాలను నిర్ణయించే గడియారపు ముళ్ళు.

ఆ పిల్లవాడు నిరాశగా. భుజాలు వాల్చుకొని మెల్లగా లోని కొచ్చాడు. "ఇంకా 'టైం' కాలేదండీ...ఇంకా నీడ బారెడు దూరముంది" అంటూ మెల్లగా తన స్థలంకేసి నడిచాడు.

నాచేతి మణికట్టును మాష్టారిచేతి కప్పగించి అలా కళ్ళప్పగించి ఆయనకేసి చూడసాగాను. నాల్గయిదు నిముషాల వరకూ కేస్ 'డయాగ్నస్' చేసిన తరువాత చేతికి విముక్తి లభించింది.

"జ్వరమేమీ లేదు. కేవలం జలుబు వలన తల భారంగా ఉంది. అంతే. దగ్గు రావటంలేదు కదా?"

'ఔన'న్నట్లు తల ఊపాను.

'ఈలాటి వాటికి ఇంగ్లీషు మందులేవీ పనిచెయ్యవు...'ఒక్కసారి శొంటిపట్టు వేస్తే మళ్ళీ తిరిగి చూడదు..."

అమ్మ బాబోయ్. త్రుళ్ళిపడి లేచి నిలబడ్డాను, వెళ్ళిపోటానికి ఉద్యమిస్తూ...

"లేచారేం...కూర్చోండి ... పట్టు వేస్తాను", అంటూ, నా అభిప్రాయంకోసం ఎదురు చూడకుండా గభాలున లేచి మూలనున్న బీరువా తీశాడు.

జాజి చెక్కలతో చేసిన చిన్న బీరువా—దానినిండా ఏవో మూలికలు వేరులు-ఏవో-చిన్న చిన్న మందు సీసాలు — తలుపు తియ్యగానే ఘాటుగా వాసన ముక్కులను తాకింది. అందులోనుండి ఓ శొంఠికొమ్ము తీసి ఇద్దరు శిష్యులను పిలిచాడు. ఆ అగంతుకు లిద్దరూ రివ్వున సన్నె కల్లుపై వాలి, ఒకరు నీటిధార విడుస్తూంటే మరొకడు అరగదీస్తూ-గంధం రంగరించసాగారు.

ఆ పట్టు ఇంటివద్ద వేయించుకొంటానని చెప్పటానికి ప్రయత్నిస్తూ చెప్పలేక ముఖమాట పడుతూ నిలబడిపొయ్యాను కొద్ది క్షణాలు.

అంతలోనే వీధిలో పిల్లవాని ఏడుపు వినిపించింది. అందరి దృష్టి అటు తిరిగింది.

ఓ పెద్దమనిషి తన సుపుత్రుడ్ని చెయ్యి పట్టుకొని బరబరా ఈడ్చుకొచ్చాడు—చెమట్లు కక్కుకొంటూ. ఈడ్చుకు రాబడినవాడు ప్రకాష్. ఏడుస్తూన్న స్వరం తగ్గించి కళ్ళు రుద్దుకొంటూ నిలబడ్డాడు. చంకలో మురికిసంచి వేలాడుతోంది. వాళ్ళిద్దరికీ ఎడంగా నిలబడి వీధి వాకిట్లోనుండి భయం భయంగా చూస్తున్నాయి రెండు చిన్నకళ్ళు. ఆ ఇంటిలోకి అడుగుపెట్టే సాహసం లేక వాకిట్లో నిలబడి చూస్తున్నాడు బుజ్జి.

"ఇదుగో అయ్యగారూ ... ఈడు బడికొచ్చాడా, లేదా? అన్న ధ్యాసేలేదు తమకు...బడికి రాకపోతే మానే ... ఇంట్లోనైనా కుదురుగా కూకోవాలా?...అదీ లేదు...అ నరసింహారావుగారి మనుమడూ, వీడూ కలిసి కోతికొమ్మంచి ఆడుకోబొయ్యారంట. ఆటలో ఏ చెట్టుకొమ్మ పటిందో వాడి చొక్కా కాస్తా చినిగింది. వాడు సంగనాచిలా ఇంటికి పోయి మావాడిమీద చెప్పాడంట; ఇకచూడు — ఇంట్లో పిల్లా టీరకాయు

అందరూ 'కయ్'మంటూ మా ఇంటిమీద కొచ్చారు. వీడ్నడిగితే నేను చించలేదంటాడు. ఆ...బడీ లేదూ ... బండలూ లేవు ... ముప్పొద్దూ తినటం ఇలా గాలిగంగలా తిరగటం—ఇంటి మీదకు తగాదాలు తేవటం" అంటూ మళ్ళీ రెండు అంటించాడా పెద్దమనిషి కోపం పట్టలేక:-

"మీరు వదిలిపెట్టండి...ఏంరా...ఇటురా "

శరీరం కంపించిపోతూండగా, అడుగు ముందుకు వెయ్యలేక, నిస్సహాయుడై మాష్టారికేసి చూడసాగాడు.

"రా ఇటు..." వాళ్ళ నాన్న ముందుకు నెట్టాడు.

"ఈవాళ బడికెందుకు రాలేదు? రాకపోగా నీవు చేసే ఘనకార్యాలివా? ఆ.. చెప్పు.. ఎప్పుడైనా బడి ఎగ్గొడతావా?" అంటూ ఛళ్ళు ఛళ్ళున బెత్తం ఝుళిపించాడు.

"ఎగ్గొట్టను...ఎగ్గొట్టను .." అంటూ దెబ్బలు తగిలిన స్థలాలపై వీపుపై చేతులతో ప్రథమ చికిత్స చేసికొంటూ ప్రకాష్ చిందులు తొక్కసాగాడు ఏడుస్తూ.

"వెధవ! తోటపిల్లలు చూడు. ఎంత ముద్దుగా వ్రాసుకొంటున్నారో! వ్రాయి—చూసివ్రాత వ్రాయి .." వీపుపై ఓ చురక వేశాడు కొసరు.

"రాత్తా.. రాత్తా.." ఒక చేత్తో వీపు రుద్దుకొంటూ, మరో చేత్తో పలక రుద్దుకోసాగాడు.

ముందుకు వంగి దేహశుద్ధి చేసిన ఉపాధ్యాయుడు అలసిపోయి నిటారుగా లేచి నిలబడ్డాడు.

"పంతులుగారూ. నేనిప్పుడే చెబుతున్నా.. అమ్మా—బాబూ అంటే ఈడు మాటఇనే రకంకాదు. తన్నటమే మందు, ..వళ్ళొదిలిపెట్టాపో

నెత్తికెక్కి కూచుంటాడు... మరి నే పోతున్నా పంతులుగారూ?..." అంటూ ఒకడుగు వాకిలివైపు వేసి మళ్ళీ అన్నాడు, "వాడ్ని మద్దినేల తిండికికూడ వదిలిపెట్టవద్దు. కావాలంటే జీతగాడిచేత రాడకే పంపిత్తా" అంటూ అన్వేషిస్తూన్న చూపులతో పిల్లల మధ్య చుట్టూరా చూశాడు.

"మా బుజ్జిగాడేడి ... ఇప్పు డిక్కడ్నే నిలబడ్డాడుగా?" సందేహంగా ప్రశ్నించాడు. అందరూ చుట్టూరా కలయజూశారు. నేను వాకిట్లో నుండి వీధిలోకి తేరిపార చూశాను. సదరు అభ్యర్థి జమ్మిచెట్టునుండి భయం భయంగా పరికిస్తున్నాడు. సోదరుడు సత్కరింపబడటం చూసి పిల్లిలా మెల్లగా మునిగాళ్ళమీద జారుకున్నాడు ఎవరికీ తెలియకుండ.

"ఆపోశారేం ... త్వరగా కానివ్వండి..." రంగరించటం ఆపి కళ్ళప్పగించి చూస్తూన్న శిష్యులను హెచ్చరించాడు మాష్టారు.

"ఏం అబ్బాయ్ వత్తావా?...ఉంటావా?" అంటూ లాంఛనంగా నన్ను అడుగుతూనే "బుజ్జీ. ఒరేయ్ బుజ్జిగా .." అంటూ కేకవేస్తూ వాళ్ళ నాన్న నిష్క్రమించాడు.

శిష్యులిద్దరూ శాంతిగంధం తీసి మర్రిఆకుపై వ్రాశారు. నాసటపై మర్దించటానికి మాష్టారు సన్నాహాలు చేసుకోసాగాడు. వాటిని పరికించి వీధి వాకిలి సమీపించి.—

"ఆ గంధం నాచేతి కివ్వండి ... నేనింటికి వెళ్ళి పడుకొని మా అమ్మమ్మచేత వేయించుకుంటా ... లేకపోతే ఇక్కడ్నే కళ్ళు మూసుకొని కూర్చోవాలి" అన్నాను - ఆకుకోసం చేయిచాస్తూ.

"చిత్తం చిత్తం అలానే ... పట్టువేయించుకొని విశ్రాంతి తీసికోండి...బాగా ఉష్ణం ప్రకోపిస్తే నాకు కబురుచెయ్యండి ... ఎందుకులెండి నేనే ఓమారు సాయంత్రం వచ్చి చూస్తాను -" నడుస్తూంటే వెనగ్గా ఆయన మాటలు వినిపించాయి.

మళ్ళీ వెనుదిరిగి చూడకుండ హుటాహుటి పెద్ద పెద్ద అంగలు

వేస్తూ ఇంటివైపు నడిచాను. సుష్టుగా భోంచేసి పెరటివైపు పంచలో మేను వాల్చాను. పెళపెళమంటూన్న ఎండలో తిరిగి అలసిపోయిన శరీరం వెంటనే గాఢ సుషుప్తిలో మునిగిపోయింది. తిరిగి మెళకువ వచ్చి చూసే సరికి కాళ్ళ వైపు బుజ్జి కూర్చుని ఉన్నాడు.

రోజు ఉదయం నేను లేచేసరికి నవ్వుతూన్న కళ్ళతో పల్కరించిన బుజ్జి ముఖమంతా జిడ్డు జిడ్డుగా వుంది.

కళ్ళలో కాంతిలేదు,

ఆ చిన్నారి హృదయంలో ఏదో వ్యధ కనుపాపల్లో ప్రతిఫలి స్తోంది.

కుతూహలం లేదు.

చిలిపితనం లేదు. కనుబొమలు పైకెత్తి నాకేసి అర్థిస్తూన్న చూపు లతో చూశాడు. ఆ చూపులో ట్రాన్సిస్టర్ లేదు,

"హల్లో బుజ్జి ... ట్రాన్సిస్టర్ పెట్టనా ?"

తల అడ్డంగా ఊపాడు – అలవోకగా నాకేసి చూస్తూ ... ట్యూన్ చేసి చేతిలో పెట్టబోయ్యాను. "వద్దు వద్దు" అంటూ దూరంగా జరిగాడు. వాడి విపరీత ధోరణి చూసి విస్మయుం చెంది పరీక్షగా. చూశాను. నా చూపులు భరించలేక తల క్రిందకు దించేసుకున్నాడు.

కనురెప్పలు వాలిన వాడి కళ్ళలో ఆవేదన.

నాలో వాడ్ని గూర్చిన ఆలోచన.

వేడియో పొడుకొంటోంది.

పిధికేసి దీర్ఘమైన వాడి చూపులు – ఎవరినో నిరీక్షిస్తూ తత్తర పాటుతో ఉన్న కళ్ళు – కళ్ళచుట్టూ మెరుస్తూన్న కన్నీరు. మంచం దిగి అనుమానంగా చూస్తూ వాకిలివైపు నడిచాను.

అంతే !

విసురు గాలిలా వచ్చి నా కాళ్ళను పెనవేసుకొన్నాడు. పైజమాలో ముఖం దాచుకొంటూ బిగ్గరగా ఏడుపు - బుగ్గలపై కన్నీటిబిందువులు టప టప రాలిపోసాగాయి.

"ఏమిటి ... బుజ్జీ ... ఏమిటి ఏడుపు ... నాతో చెప్పు" బుజ్జగిస్తూన్న కొద్దీ ఏడుపు మరింత ... ఎక్కువైంది, తన చిన్నారుగడ్డాన్ని పైకెత్తి -

"ఏమిటి చెప్పు ... భయపడకు. వీధిలో ఏముంది? నన్ను చూడ నివ్వు" అంటూ వాణ్ని విడిపించుకోబోయ్యాను.

మరింత గట్టిగా కరచిపట్టుకొంటూ "మా అమ్మ ...అయ్యగారిని తీసుకొస్తుంది...నన్ను కూడ బళ్లోకి పంపిస్తదంట... నే నింకెప్పుడూ పగలకొత్తను" వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

అంతలో పంతులుగారితో సహా వాళ్ళ అమ్మ ప్రత్యక్షమైంది - వీథిలోనుండే అరచుకొంటూ,

"ఇక్కడ నక్కావా?... వెధవా? నే నింకా ఊరంతా దేవులాడుతున్నా ... పద ఇంటికి ... చూడబ్బాయ్ ... నీలాటి చదువుకున్న వాళ్ళు ఎవరైనా వస్తే పనికొస్తాయని నాలుగు గాజు గళాసులు కొన్నా...అవి కొని ఇప్పటికి నాలుగేళ్ళయింది. అదే వీడు పుట్టకముందు ...ఈవాళ వాడికి అదేం బుద్ధిపుట్టిందో - వద్దురా అంటే దానితోనే మంచి నీళ్ళు తాగాలని మొండికేసి, దాన్ని అటుతిప్పి ఇటుతిప్పి కులికించాడు. బంగారంలాటి గళాసు - చివరకు వీడి చేతుల్లో దానికి ఆయుస్సు మూడింది ... పాడుపిల్లలు ... వేధించి చంపుతున్నారంటే నమ్మ ... వీళ్ళ అమ్మ కడుపు మాడ...ఎంత కోపంవచ్చినా దిగమింగుకోవాల్సిందే కానీ ... చూస్తా...చూస్తా ఒకదెబ్బ వెయ్యబుద్ధికాదు. ఇక వాడు - పెద్దాడితోపాటు వీడ్ని కూడ బళ్ళో వేద్దాం - చిక్కుదీసినట్లు హాయిగా ఉంటుందని బళ్లోకి పంపిస్తారాంటే ... ఇదిగో ఇక్కడ చేరాడు ..." మాట్లాడటం ఆపి ఊపిరి పీల్చుకోసాగింది.

"అహా ... అయితే వీడు గడుగ్గా యన్నమాట. రేపటిన్నుంచి పంపండి నా దగ్గరకు ... మొక్కాయి వంగనిదే మానయి వంగుతుందా ...ఇప్పుడే వంచాలి ..." కళ్ళద్దాలనుండి చూపులు పొడుచుకుంటూ అన్నాడు.

బుజ్జి నన్ను మరింత గట్టిగా పొదివిపట్టుకొన్నాడు.

నిప్పుకోడి ఇసుకలో తలదూర్చి ప్రాణాపాయం తప్పిందని భావించినట్లు నా కాళ్ళమధ్య తలదూర్చి ఏడుపు బిగపట్టుకొన్నాడు. నాసికా రంధ్రాలు మాత్రం శ్వాస పీల్చుకొంటున్నాయి.

"అయితే ... నీవే పంతులుగార్ని వెంటబెట్టుకొచ్చావా వదినా..? అన్నాను, వాడికి సంభవించిన అత్యవసర పరిస్థితిని "ఎనాలైజు" చేస్తూ.

"లేదండీ...నేను తమకు తలనొప్పి ఎలా ఉందో విచారించి పోదాం ... మీకు శొంఠిపట్టు కుదరకపోతే వేసిపోదామని వస్తూంటే, దారిలో వీరు కలిశారండీ..." సమాధానమిచ్చింది పంతులుగారి కంఠం.

బుజ్జి శరీరంలో కంపనం విద్యుత్‌లా నాలో ప్రాకింది. ఓ క్షణానికి నిభాయించుకొని ఇంటిలోకి వచ్చాను. నా అదృష్టవశాత్తు మా అమ్మమ్మ ఆ దరిదాపుల్లో లేదు. ఒకవేళ ఆమె వినటం సంభవించిందంటే "పంతులుగారు ఇంతదూరం నీకోసం వస్తే వేయించుకోకపోతే ఏంబాగుంటుందని" బలవంతం చేస్తుంది. ఆమె చెంతలేకపోవటంవలన ధైర్యంగా ఓ అబద్ధం పలికాను,

"ఇందాకా బడినుంచి రావటంతోనే పట్టు వేసికొని పడుకొని ఇప్పుడే లేచి ముఖం కడుక్కున్నాను. పూర్తిగా తగ్గిపోయిందిలెండి..." ఆయన మనస్సు నొప్పించకుండా మరి రెండు మాటలు మాట్లాడి త్వరగా అక్కడినుండి వారు నిష్క్రమించేలా చూశాను.

ఆయన పోతూపోతూ "మరి వీడ్ని సాయంత్రం నా దగ్గరకు తీసుకురండి..." అన్నాడు బుజ్జిగాడ్ని ఉద్దేశిస్తూ.

ఆమె "బుజ్జి" ఎలాటి కొరకరాని కొయ్యనో. ఇంట్లో ఎంత అగడం చేస్తాడో అన్నీ "టేప్ రికార్డులు" చదివి పారవేసి ... "ఏది ఎలా ఉన్నా మరదీ ...వీణ్ని మాత్రం బళ్లో వెయ్యాల్సిందే. నా ప్రాణా నికి యముడిలా దాపురించాడు ..." ఆమె ఆగిపోయింది. కొరకొరా పుత్రుడికేసి చూస్తూ.

"బాబోయ్ ... నే నింక పగలగొట్టను. నన్ను బళ్లోకి పంపియ్యొద్దని చెప్పు - నేను...నేను...అమ్మ చెప్పినట్టు మాట వింటా" ముక్కునా పై జావాకు బుజ్జి రుద్దుతూ మళ్ళీ బిగ్గరగా బాకా ఎత్తాడు.

"ఇంకేం వదినగారూ ... మీరు చెప్పినమాటల్లా వింటానంటున్నా డుగా ... ఈసారికి వదలిపెట్టండి ... మళ్ళీ ఏదైనా గొడవచేస్తే నాతో చెప్పండి...కాళ్ళూ, చేతులూ కట్టి బళ్లో పడవేసి వస్తా ... ఏరా సరేనా?" గద్దించాను సమస్యా పరిష్కారం సూచిస్తూ.

తల పైకెత్తకుండానే "సరే" నన్నట్లు తల ఆడించాడు - ఒడంబడికకు ఆమోదముద్ర వేసినట్లు.

ఆ తల ఆడింపుతో ఉబ్బితబ్బిబ్బయిపోయి, వాళ్ళమ్మ ప్రేమ పూర్వకమైన చూపులతో తనయుణ్ని చూస్తూ చిరునవ్వుతో మా గడప దాటింది. ఆమె వెళ్ళిపోయిన అడుగులసవ్వడి గ్రహించి తలప్రక్కకు తిప్పుకొని చూశాడు బుజ్జి. నిశ్చింతగా నిట్టూర్పు విడిచి కళ్ళుపైకెత్తి నా కళ్ళల్లోకి సూటిగా చూశాడు. కృతజ్ఞతా పూర్వకమైన వాడి కళ్ళు ఆరిపో తూన్న కన్నీటి బిందువులతో మిల మిల లాడుతున్నాయి.